# గొప్పలకోసం అప్పుల పాలుచేసే ఆ భార్యలకి భర్తలు బుద్ధిచెప్పిన వైనం

## పద్మశ్రీ కథ

## టిట్ ఫర్ టాట్

అప్పటివరకూ ఆ వీధిలో గుట్టుగా కాపురం చేసుకుంటున్నారు పద్మ, శ్రీనివాసులు. అన్నిరోజులు ఖాళీగా ఉన్న పక్క పోర్షన్‌లోకి ఆరోజే ప్రవేశించారు సత్యం, రమాదేవిలు. శ్రీనివాస్ ఓ గవర్నమెంట్ ఆఫీసులో చిరుద్యోగి. సత్యం కూడా అదే మోస్తరు జీతం సంపాదించుకునే ఉద్యోగి. అన్ని రోజులు భర్త ఆఫీసుకెళ్ళగానే బోర్ ఫీలయ్యే పద్మ, రమ రాకతో నూతనోత్తేజాన్ని పొందింది. ఇంకేం ఇద్దరు ఆడవాళ్ళు కలిసిపోయారు అంటే ముందుగా పొగిడేది వారి భర్తలనే కదా. ''మావారు ఇంద్రుడు చంద్రుడు'' అంది రమ.

''మావారు రాజీవ్‌గాంధీ, వి.పి.సింగ్''. అంది పద్మ. ఈ పోలికకు వళ్ళు మండింది రమకు ఐనా తమాయించుకుంది.

''మావారు నేనేం చెబితే అది వింటారు . నాకేం కావాలన్నా కొనిస్తారు .'' అంటూ ఓ చీరె చూపించింది రమ. మర్నాడు భర్తతో పోరాడి అలాంటి చీరే తెప్పించుకుంది పద్మ.

''ఇవి మావారు చేయించిన నగలు'' అంటూ మరోసారి చూపించింది రమ. పంతంకోసం రెండ్రోజులు నిరాహారదీక్ష చేసి ఎలాగో వాటిని కూడా సాధించుకుంది పద్మ. ఇలా నిత్యం ఉద్రేకంతో బుసలు కొట్టేది పద్మ, రమలైతే నిత్య దరిద్రంతో నీరసించిపోయేది శ్రీనివాస్, సత్యంలు.

''ఓరోజు దీన వదనులై ఎదురుపడ్డారు దరిద్రులిద్దరు. ఏదో మాట్లాడుకున్నారు. అంతే ఆరోజు సాయంత్రం పద్మ భర్తపై విరుచుకుపడుతోంది.



"ఛీ...మీకేమైనా మతిపోయిందా. తాగొస్తారా? ఛీ..ఛీ?" అంది పద్మ

"డియర్" మాటలంటేనే నేనుపడను. ఎదరింటి సత్యం తాగుతుంటే చేతకాని వాణ్ణి నేనేనా. నేనూ తాగాను. లేకపోతే నీ ప్రెస్టేజ్ ఏమయ్యేది? వాళ్ళు నిన్ను చూసి నవ్వేవారు కదా? అన్నాడు శ్రీనివాస్.

"వాళ్ళతో మనకు పోటీనా? వాళ్ళు చేసే వెధవపన్లు మీరు చేస్తారా? ఇది వచ్చినా సహించను" అంది పద్మ కోపంగా.

"ఓ.కే ఈ రోజునుండి వాళ్ళుచేసే వెధవపన్లు నువ్వూ, నేను ఎవరు వెయ్యొద్దు. సరైనా? అన్నాడు శ్రీనివాస్.

పాపం. 'సరే' అనక తప్పలేదు పద్మకు.

ఈ ఇంట్లో ఇలా జరుగుతుండగా పక్క పోర్షన్లో కూడా దాదాపు ఇదే కథ జరుగుతోంది.

*